క్లుప్తంగా

అయ్యప్పస్వామి మండల పూజలు



అయ్యప్పస్వామి సన్నిధిలో శీవేలి ఉత్సవం

నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానంలో స్వామివారికి కేరళ సంప్రదాయంలో మండల పూజలు విశేషంగా నిర్వహిస్తున్నారు. భక్తులు విశేషంగా హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఉభయకర్తలుగా పసుపులేటి చంద్ర, బట్టీపాటి ప్రసాద్, మాధవి వ్యవహరించారు. కార్యక్రమాలను శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం పాలక మండలి అధ్యక్ష, కార్యదర్శులు జి.శేషగిరిరావు, కె.వెంకటరత్నం, కోశాధికారి జి.రత్నయ్య, కె.మోహన్‌రావు, కేజీ శంకరన్, బి.మురళీమోహన్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

శత కలశాభిషేకం.. పడిపూజ నేడు

మండల పూజోత్సవాల్లో భాగంగా బుధవారం అయ్యప్పస్వామి వారికి శత కలశాభిషేకం, విశేష పుష్పాభిషేకం, పడిపూజ నిర్వహించనున్నట్లు శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం పాలకమండలి అధ్యక్షుడు గూడల శేషగిరిరావు మంగళవారం తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత కార్యాలయం పరిధిలోని అంగన్‌వాడీ పోషణ 2.0 కింద ఖాళీ అయిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిలో నియామకం చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు ఆ శాఖ అధికారిణి హేనాసుజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిస్ట్రిక్ కోఆర్డినేటర్-1, ప్రాజెక్ట్ అసిస్టెంట్-1, బ్లాక్ కోఆర్డినేటర్-10 పోస్టులకు అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తులను సంబంధిత పత్రాలతో ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకు నగరంలోని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

కనుల పండువగా కార్తీక దీపాల ఉద్వాసన

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కార్తీక మాసం చివరి రోజు మంగళవారం కార్తీక దీపాల ఉద్వాసన కార్యక్రమం కనుల పండువగా నిర్వహించారు. నగరంలోని వెంకటేశ్వరపురంలో ఉన్న శ్రీదేవీ భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాల ఉద్వాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు సాయిభరద్వాజ, కమిటీ సభ్యులు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

కోడూరుపాడు వద్ద స్థానికుల ఆందోళన

నెల్లూరురూరల్: అధిక లోడ్‌లతో ఇసుక రీచ్ నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో తమ ప్రాంతంలోని రోడ్లు గుంతలమయంగా మారాయంటూ నెల్లూరు రూరల్ మండలంలోని కోడూరుపాడు వద్ద స్థానికులు మంగళవారం ఆందోళన చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నేతలు లేబూరు పరమేశ్వరరెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, 1వ డివిజన్ కార్పొరేటర్ జానా నాగరాజు ఆధ్వర్యంలో ప్రధాన రహదారిపై నిరసన తెలుపుతూ ఆందోళన చేశారు. దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించిన తరువాతే ఇసుక వాహనాలు రాకపోకలు సాగించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో రీచ్ నిర్వాహకులు అక్కడికి చేరకుని స్థానికులతో చర్చలు జరిపారు. ధ్వంసమైన రోడ్లను పునరుద్ధరిస్తామని రీచ్ నిర్వాహకులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

సీహెచ్‌సీకి ట్రెయినీ కలెక్టర్



ఆస్పత్రి వైద్యులతో మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా

కోవూరు : స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ట్రెయినీ కలెక్టర్ సంజనా సిన్హా మంగళవారం పరిశీలించారు. ముందుగా ఎక్స్‌రే రూమ్‌ను, ఆపరేషన్ థియేటర్‌ను సందర్శించారు. ఇక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలు, సదుపాయాలు, రోజులో ఎంత మందికి వైద్యం అందిస్తున్నారు.. తదితర వివరాలను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజేతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మహిళా వార్డుకు వెళ్లి రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె బీపీ టెస్ట్ చేయించుకున్నారు. ఆమెతో పాటు డీఎంహెచ్‌ఓ పెంచలయ్య కూడా పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు వెంకటపతి, ఆయుర్వేద వైద్యులు, సీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరినీ ఓటర్లుగా చేర్చండి

- కమిషనర్ వికాస్‌మర్మత్

నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓటు నమోదుకు అర్హులైన వారందరినీ గుర్తించి ఓటరు జాబితాలో చేర్చాలని కమిషనర్ వికాస్‌మర్మత్ ఎన్నికల విభాగం సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం ఏపీజే అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో ఎన్నికల విభాగం అధికారులు, సూపర్‌వైజర్లతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కమిషనర్ మాట్లాడారు. సిటీ నియోజకవర్గ పరిధిలోని అన్ని సచివాలయాల్లో అర్హులైన వారి నుంచి ఓటు నమోదు దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. ఇప్పటి వరకు అందిన దరఖాస్తుల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఓటరు ముసాయిదా జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. సమావేశంలో ఏఈఆర్‌ఓలు దేవీకుమారి, నిర్మలానందబాబా, శ్రీనివాసులు, దశయ్య, సూపర్‌వైజర్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ వికాస్‌మర్మత్

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో 2024వ సంవత్సరానికి సంబంధించిన ఓటర్ల లిస్ట్ డ్రాఫ్టరోల్ రేషనలైజేషన్ తదితర అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కమిషనర్ వికాస్‌మర్మత్ సమావేశం నిర్వహించారు. మంగళవారం నగరంలోని కార్పొరేషన్ కార్యాలయం కమాండ్ కంట్రోల్ విభాగంలో జరిగిన ఈ సమావేశంలో పలు పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగాధికారులు పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్ ఆదేశాల మేరకు స్థానిక 46వ డివిజన్ 46/1 సచివాలయం పరిధిలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని ఏసీ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ఆ సచివాలయం వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడప గడపకు వెళ్లి 'మా నమ్మకం నువ్వే జగన్' కరపత్రాలు పంపిణీ చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, నెల్లూరు సిటీలో పి.అనిల్‌కుమార్‌ను ఆశీర్వదించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో 46వ డివిజన్ కార్పొరేటర్, 3వ క్లస్టర్ ఇన్‌చార్జి వేలూరు ఉమామహేష్, డిప్యూటీ మేయర్ ఖలీల్‌అహ్మద్, బీసీ వెల్ఫేర్ రాష్ట్ర డైరెక్టర్ వేలూరు రాము, 48వ డివిజన్ ఇన్‌చార్జి సిద్దిఖ్, రాము, లక్ష్మణ్, ముల్లంగి ప్రభ, నాగరాజు, గోవిందు, సతీష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలో 7వ డివిజన్ 7/2, రైతుబజారు రోడ్డు సచివాలయ పరిధిలో కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, 11వ డివిజన్ 11/3 నిర్మలనగర్ సచివాలయ పరిధిలో కార్పొరేటర్ గోతం అరుణ, 54వ డివిజన్ 54/1 లంగరుతోట సచివాలయ పరిధిలో కార్పొరేటర్ షేక్ సఫియా బేగం 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న నాయకులు

డ్రైవర్, కండక్టర్‌లకు బహుమతులు

నెల్లూరు సిటీ: ఏపీఎస్‌ఆర్‌టీసీ నెల్లూరు డిపో-1లో నవంబర్ నెలలో అత్యధిక ట్రిప్‌లు, టికెట్ కలెక్ట్ చేసిన డ్రైవర్లు, కండక్టర్లకు డిపో మేనేజర్ కేవీ మురళీకృష్ణ నగదు బహుమతులు అందజేశారు. నగరంలోని ప్రధాన ఆర్‌టీసీ బస్టాండ్‌లో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించి ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్యధిక కలెక్షన్ చేసిన కండక్టర్లు మధుకుమార్, జేఎస్‌రెడ్డి, భాషాలకు నగదు బహుమతులు అందజేశారు. అలాగే వివిధ విభాగాల్లో విధుల్లో మంచి ఫలితాలు తెచ్చిన 11 మందికి నగదు బహుమతులు అందించారు.



ఉద్యోగులకు నగదు బహుమతులు అందజేస్తున్న అధికారులు

శంకరమఠంలో శ్రీమహా మృత్యుంజయ పాశుపత హోమం

నెల్లూరు(బృందావనం): కార్తీక అమావాస్య సందర్భంగా నెల్లూరు నగరంలోని మూలాపేట శంకరమఠంలో మంగళవారం శ్రీమహా మృత్యుంజయ పాశుపత హోమాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కోట శ్రీరామమూర్తి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాన్ని మఠం నిర్వాహకులు కొ్రపాటి నందకిషోర్ - ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.



జాబ్‌మేళాకు విశేష స్పందన

నెల్లూరు(మినీబైపాస్): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నగరంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఉపాధి అధికారి కె.వి.రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌మేళాలో కెరీర్ హెచ్.ఆర్. సొల్యూషన్స్, పైసా బజార్, అపాచె ఫుట్‌వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్వ్యూలకు 97 మంది హాజరు కాగా 66 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. కెరీర్ హెచ్.ఆర్.సొల్యూషన్‌కు 32 మంది, పైసా బజార్‌కు 18 మంది, అపాచె ఫుట్‌వేర్‌కు 16 మంది మొత్తం 66 మంది ఎంపికయ్యారని తెలిపారు.



జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారితో కంపెనీల ప్రతినిధులు

లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చర్యలు

నెల్లూరు సిటీ/నెల్లూరు రూరల్ : స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మలోల హెచ్చరించారు. నెల్లూరు నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం అమలుపై ఆర్డీఓ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు డివిజన్ పరిధిలో మొత్తం 133 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయని, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగనిర్ధారణ పరీక్షలు జరిపితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లింగనిర్ధారణ పరీక్షలను ప్రోత్సహించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డివిజనల్ ప్రోగ్రాం అధికారి పీఎల్ దయాకర్ మాట్లాడుతూ ఇప్పటికే అనుమానిత స్కానింగ్ సెంటర్లపై నిఘా ఉంచామన్నారు. సమావేశంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డెమో బి.శ్రీనివాసరావు, డాక్టర్ విజేత, జయపాల్, రూప, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మలోల

ప్రభుత్వ సాయం అందజేత

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వరద బాధితులకు మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలు, అధికారులు ప్రభుత్వ సాయాన్ని అందజేశారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఆదేశాలతో 24, 1వ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి ఆయా ప్రాంతాల నాయకులతో కలిసి తుఫాన్ బాధితులకు రూ.2,500 నగదు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. కార్యక్రమాల్లో నగర మేయర్ స్రవంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే నగరంలోని 42వ డివిజన్‌లో కార్పొరేటర్ కరిముల్లా ఆధ్వర్యంలో వరద బాధితులకు ఆర్థికసాయం, బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



కోడూరుపాడు వద్ద తుఫాన్ బాధితులకు సాయం అందజేస్తున్న రంగారెడ్డి తదితరులు

ముగిసిన కార్తీక మాసోత్సవం

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసోత్సవం చివరి రోజు మంగళవారం మూలాపేటలోని శ్రీభువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు శాస్త్రోక్తంగా రుద్రహోమం, క్షీరాభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అర్చనలు నిర్వహించారు. సాయంత్రం ఆకాశదీపం ముగింపు, విశేష పుష్పాలంకరణ నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆనం రామనారాయణరెడ్డి - శిరీష దంపతులు వ్యవహరించారు.

భక్తిశ్రద్ధలతో పోలాల అమావాస్య

కార్తీక మాసోత్సవం ముగింపు సందర్భంగా అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం రాత్రి 'పోలాల అమావాస్య'ను విశేషంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలోని స్వామివారి పుష్కరిణిలో కార్తీక దీపాలు వెలిగించి పుష్కరిణిలో వదిలారు. అనంతరం స్వామివారికి దీపహారతులు సమర్పించారు. అనంతరం విశేష పుష్పాలంకరణలో స్వామివారు పల్లకీలో వేంచేపు చేసి ప్రాకారోత్సవం వేడుకగా నిర్వహించారు. ఉభయకర్తలుగా ఆల్తూరు గిరీష్‌కుమార్‌రెడ్డి - లత దంపతులు వ్యవహరించారు.



మంత్రిని కలిసిన వీసీ



నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆచార్య ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారదా జయలక్ష్మీదేవి మంగళవారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె మంత్రితో పలు అంశాలపై చర్చించారు.

డైరీ ఆవిష్కరణ



నెల్లూరు(బృందావనం): నెల్లూరు పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర డైరీని ఆవిష్కరించారు. నగరంలోని నీలగిరి సంఘం హెబ్రోన్ బిలీవర్స్ అసెంబ్లీ చర్చిలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో తిరుపతి క్రైస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ జోబ్‌జాన్సన్ వాక్యోపదేశం చేశారు. ఫెలోషిప్ అధ్యక్షుడు రెవరెండ్ ఎస్.శరత్, ప్రధాన కార్యదర్శి రెవరెండ్ బి.డేవిడ్‌దయాసాగర్, గౌరవాధ్యక్షుడు కె.సాల్మన్, ఉపాధ్యక్షుడు బి.కోటేశ్వరరావు, కోశాధికారి డాక్టర్ భాస్కరయ్య, బ్రదర్ పాల్కోటి, సాల్వేషన్ ఆర్మీ కేరళ టెరిటరీ కమాండర్ కల్నల్ జాన్ విలియం, పాస్టర్లు పాల్గొన్నారు.

జెడ్పీ వాకర్స్‌కు ఉత్తమ పురస్కారాలు



నెల్లూరురూరల్: జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ గవర్నర్ మెట్టు సుధాకర్‌రెడ్డి జెడ్పీ వాకర్స్ ఉత్తమ పురస్కారాలను అందుకున్నారు. నగరంలోని రోటరీ క్లబ్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ వాకర్స్ కాన్ఫరెన్స్‌లో వీరికి మెమొంటోలు అందజేసి సత్కరించారు. అలాగే జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు 12 మందికి మెమొంటోలు అందజేసి సత్కరించారు. మంగళవారం పొదలకూరు రోడ్డు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సన్మానగ్రహీతలను పలువురు అభినందించారు.

నేడు 'స్టడీప్లస్-2023'

- పదో తరగతి పరీక్షల్లో విజయ సాధనకు ఉచిత శిక్షణ

నెల్లూరు(బృందావనం): పదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వివిధ అంశాల్లో స్ఫూర్తిని కలిగించేందుకు నగరంలోని పురమందిరంలో బుధవారం 'స్టడీప్లస్ 2023' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సైకాలజిస్టు, కార్యక్రమ కన్వీనర్ కె.డొమినిక్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం నెల్లూరు పురమందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో 10వ తరగతి అత్యంత కీలకమైందని, ఈ సమయంలో వారు తమ జీవిత లక్ష్యాలను, చేపట్టాల్సిన వృత్తిని నిర్ధారించుకోవడంతోపాటు, రానున్న పబ్లిక్ పరీక్షలను ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా రాసేందుకు ఈ కార్యక్రమాన్ని నెల్లూరులో నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు రెండు సెషన్స్‌లో వృత్తి లక్ష్యాల సాధన, విద్యానైపుణ్యాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపొందించుకునే మార్గాలు, పరీక్ష నైపుణ్యాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో సైకాలజిస్టులు, ట్రైనర్స్, కోకన్వీనర్లు సీహెచ్ రమేష్‌బాబు, వి.చంద్రశేఖర్, పి.రమణయ్య పాల్గొన్నారు.



స్టడీప్లస్-2023 ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆదరించాలి

- డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి

నెల్లూరురూరల్: రానున్న ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు వైఎస్సార్‌సీపీని ఆదరించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి కోరారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ వావిలేటిపాడు సచివాలయంలో మంగళవారం 'ఏపీకి జగన్‌నే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ స్రవంతి, నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వావిలేటిపాడు సచివాలయంలో మాట్లాడుతున్న ఆనం విజయకుమార్‌రెడ్డి

కలెక్టర్‌ను కలిసిన నేదురుమల్లి



నెల్లూరు(దర్గామిట్ట): కలువాయి మండల రైతులకు సోమశిల నుంచి ఒక టీఎంసీ నీటిని కేటాయించాలంటూ వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్ హరినారాయణన్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి కలువాయి మండల రైతుల విజ్ఞప్తి మేరకు వినతిపత్రం సమర్పించారు.

సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరురూరల్: రూరల్ నియోజకవర్గంలోని 41వ డివిజన్‌లో ఎంపీ, వైఎస్సార్‌సీపీ రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనలతో మంగళవారం రూ.35 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పనిచేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు సిటీ: నగరంలోని ఏపీఎస్‌ఆర్‌టీసీ డిపో-1 నుంచి ప్రయాణించే బస్సు సర్వీసులకు సంబంధించి ఏవైనా సలహాలు, సూచనలు, సమస్యలను తెలిపేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం-1 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో-1 మేనేజర్ మురళీకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని, 9959225641 ఫోన్‌నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలుపవచ్చని పేర్కొన్నారు.

డిపో-2లోనూ..

నగరంలోని ఏపీఎస్ఆర్టీసీ నెల్లూరు డిపో-2 బస్సు సర్వీసుల్లో ఏదైనా సమస్యలు, సలహాలు, సూచనలు ఉంటే డయల్ యువర్ డీఎం-2కు తెలియజేయవచ్చని డిపో-2 మేనేజర్ శివకేశవ్‌యాదవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 4 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 9959225642 ఫోన్‌నంబర్‌కు ఫోన్ చేసి తమ సూచనలు తెలుపవచ్చని పేర్కొన్నారు.

నేడు 'పోలిస్వర్గం' విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసం చివరి రోజును పురస్కరించుకుని బాలాజీనగర్‌లోని శ్రీసీతారామస్వామి మందిరంలో బుధవారం 'పోలిస్వర్గం' విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ అధ్యక్షుడు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా తెలిపారు. మందిర కమిటీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, గంగాహారతి, గంగాపూజ, గంగాసారె సమర్పణ, గంగామాతకు దీపాల సమర్పణ నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. సమావేశంలో మందిర కమిటీ కార్యదర్శి సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు, అమరా మోహన్‌రావు, ఏవీ సత్యం, ప్రధానార్చకుడు బి.శ్రీనివాస దీక్షితులు పాల్గొన్నారు.

తుఫాన్ నష్టంపై చర్యలు

నెల్లూరు(సెంట్రల్): ఇటీవల తుఫాన్ దాటికి దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రభుత్వం అన్నిరకాల చర్యలు తీసుకుంటోందని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. నెల్లూరులోని కృషి విజ్ఞాన కేంద్రం, ఆచార్య ఎన్‌జీ రంగా పరిశోధనా స్థానంలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తుఫాన్ వల్ల పంట నష్టపోయిన రైతుల వివరాలను, పంట వివరాలను అధికారులు సేకరిస్తున్నారని తెలిపారు.